స్వీప్ పోస్టర్ ఆవిష్కరణ

కలెక్టరేట్, ఏప్రిల్ 27: జిల్లాలో శతశాతం ఓటింగ్ నమోదు చేయించే దిశగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి ప్రత్యేక చర్యలు చేపట్టారు. అందులో భాగంగా స్వీప్ పోస్టర్‌ను శనివారం తనచాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వీప్ కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్తామన్నారు. ఈ పోస్టర్‌ను సచివాలయాలు, ఆర్టీసీ బస్సులు, గ్రామాల్లో అంటించి ఓటర్లలో అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టరు త్రివినాగ్, డీఆర్‌వో అనిత, స్వీప్ నోడల్ అధికారి, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

వైసీపీ పాలనపై చార్జిషీటు

- ఐదేళ్లలో అన్యాయాలు.. అక్రమాలే
- అభివృద్ధి చేసింది ఎక్కడ?
- టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు



చార్జిషీటును విడుదల చేస్తున్న టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థులు అదితి, కలిశెట్టి, ఇతర నాయకులు

విజయనగరం రూరల్, ఏప్రిల్ 27: వైసీపీ ఐదేళ్ల పాలనంతా అన్యాయాలు.. అక్రమాలు.. అవినీతే తప్ప అభివృద్ధి లేదని, ఈ విషయాన్ని తెలియజేస్తూ ఎన్‌డీఏ కూటమి (టీడీపీ, బీజేపీ, జనసేన) తరుపున చార్జిషీటు విడుదల చేస్తున్నామని టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు ప్రకటించారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నేతలంతా ఉమ్మడిగా చార్జిషీటును ఆవిష్కరించారు. అనంతరం టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున మాట్లాడుతూ, ఐదేళ్ల కాలంలో రాష్ట్రానికి వైసీపీ ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందన్నారు. కక్షపూరితమైన చర్యలు తప్ప, ఎటువంటి అభివృద్ధీ లేదన్నారు. నిత్యావసరాల ధరలు, విద్యుత్, ఆర్టీసీ చార్జీలు పెంచేశారని, ప్రజలపై పన్నుల భారాన్ని అధికంగా వేశారన్నారు. చివరకు ప్రజలు ఉపయోగించి పారేసే చెత్తపై కూడా పన్ను వేసేశారన్నారు. దీనిపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైనా పట్టించుకునే వారే లేరన్నారు. ఈ నేపథ్యంలోనే ఐదేళ్ల కాలంలో రాష్ట్రంలో జరిగిన తప్పులు, అన్యాయాలపై ఎన్‌డీఏ కూటమి చార్జిషీటు విడుదల చేసిందని, దీనిని ప్రజల ముంగిటకు తీసుకువెళ్తామన్నారు.

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ, వైసీపీ తప్పులు చేసి ఈ రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిందన్నారు. కూటమి విజయనగరం అసెంబ్లీ అభ్యర్థి అదితిగజపతిరాజు మాట్లాడుతూ, రాష్ట్రంలో ఐదేళ్లలో ప్రజా వ్యతిరేక పాలన సాగిందని, అన్ని వర్గాలకూ ఈ ప్రభుత్వం అన్యాయం చేసిందని అన్నారు. నిరుద్యోగులకు ఏటా జనవరి 1న జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్నారని, ఇంతవరకూ చేయలేదని అన్నారు. జనసేన నాయకురాలు పాలవలస యశస్విని మాట్లాడుతూ చార్జిషీటులో పొందుపరిచిన ప్రతి అంశాన్నీ ప్రజల వద్దకు తీసుకువెళ్లి రానున్న ఎన్నికల్లో వైసీపీని చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. బీజేపీ నాయకుడు శంబర లక్ష్మీనరసింహం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిధులిస్తే, జగన్ స్టిక్కర్లు వేసుకున్నారని విమర్శించారు. సమావేశంలో టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు, కర్రోతు నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

చార్జిషీటులో కొన్ని అంశాలు

- ధరలు, పన్నులు, చార్జీలు, అప్పుల బాదుడుతో రాష్ట్రంలో ప్రతి వ్యక్తిపై రూ.10 లక్షల భారం.
- ల్యాండ్ , శాండ్, మైనింగ్, గంజాయి, డ్రగ్స్, ఎర్రచందనం, రేషన్ బియ్యంలో రూ.8 లక్షల కోట్లు కమీషన్ కాజేసారు.
- విషపూరిత మద్యంతో 35 లక్షల మంది ఆరోగ్యాన్ని పాడుచేసి, 30 వేల మహిళల మాంగల్యాలను మంటగలిపారు.
- విద్యుత్ చార్జీలు, ఆర్టీసీ, ఇసుక ధరలను విపరీతంగా పెంచేశారు.

సారూ.. నమ్మొచ్చా?



- వైసీపీ ఎన్నికల హామీలపై పెదవి విరుపు
- అనేక ప్రశ్నలు సంధిస్తున్న ప్రజలు
- గిరిజన విశ్వవిద్యాలయానికి మరో ఐదేళ్లు
- భోగాపురం విమానాశ్రయాన్నీ ఐదేళ్లలో పూర్తి చేస్తారట
- ప్రారంభం కాని అగ్రి టెస్టు ల్యాబ్
- రైతులకు 9గంటల ఉచిత విద్యుత్ ఇప్పుడేది?
- పింఛను పెంపు రూ.500.. అదీ నాలుగేళ్ల వరకు ఆగాలట

వైసీపీ ఎన్నికల మేనిఫెస్టో చూసి ప్రజలు పెదవి విరుస్తున్నారు. అమలు చేయనివి సైతం చేసినట్లు పేర్కొనడాన్ని తప్పుబడుతున్నారు. గిరిజన వర్సిటీకి మరో ఐదేళ్లు పడుతుందని మళ్లీ ఎలా చెప్పగలుగుతున్నారని మండిపడుతున్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగాలిస్తామన్న మాటను కూడా నమ్మడం లేదు. ఈ ఐదేళ్లలో జాబ్ కేలండర్ దుస్థితిని ఉదహరిస్తున్నారు. కాగా ఫిష్ ఆంధ్రాను భేషుగ్గా అమలు చేసినట్లు మేనిఫెస్టోలో పేర్కొన్నారు. కాని జిల్లాలో ఆ యూనిట్లన్నీ మూలకు చేరాయి. వైఎస్‌ఆర్ అగ్రి టెస్టు ల్యాబ్‌లదీ ఇదే పరిస్థితి. వైఎస్‌ఆర్ జలకళ, జలయజ్ఞం హామీలను కూడా ప్రజలు విశ్వసించడం లేదు.



(విజయనగరం- ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర విభజన నేపథ్యంలో కేంద్రం జిల్లాకు కేటాయించిన గిరిజన విశ్వ విద్యాలయాన్ని ఈ ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం పూర్తి చేయలేకపోయింది. పైగా వచ్చే ఐదేళ్లలో పూర్తి చేస్తామని ఈ మేనిఫెస్టోలో పేర్కొంది. టీడీపీ హయాంలో కేంద్రం మంజూరు చేసిన గిరిజన విశ్వ విద్యాలయాన్ని ఎక్కడ నిర్మించాలో తేల్చేందుకే మూడేళ్లు పట్టింది. తరువాత ముఖ్యమంత్రి శంకుస్థాపన చేసినా ఇంతవరకు అడుగు కూడా కదలలేదు. ప్రస్తుతం పరాయిపంచలో తరగతులు నిర్వహిస్తున్నారు. 91 మంది బోధనా సిబ్బంది అవసరం కాగా 18మంది ఉన్నారు. కొన్ని పీజీ గ్రూపులే ఉన్నాయి. హాస్టల్ సౌకర్యం లేని కారణంగా విద్యార్థులు చేరేందుకు వెనకంజ వేస్తున్నారు. ఉన్నతమైన వర్సిటీని ఈ ప్రభుత్వం అభాసుపాలుచేసింది.

- భోగాపురం విమానాశ్రయ పనులు ఆశించిన స్థాయిలో జరగటం లేదు. టీడీపీ హయాంలో చంద్రబాబు శంకుస్థాపన చేసిన దానికే మళ్లీ జగన్ శంకుస్థాపన చేశారు. నాలుగేళ్లుగా పట్టించుకోని జగన్ చివరి ఏడాదిలో శంకుస్థాపన చేశారు. తమ హయాంలో విమానాశ్రయ పనులను జీఎంఆర్‌కు అప్పగిస్తే ఏదో జరిగిందని గగ్గోలు పెట్టిన జగన్ మళ్లీ అదే సంస్థకు విమానాశ్రయ పనులు ఎలా అప్పగించారని చంద్రబాబు ఇటీవల ప్రశ్నించారు.
- ప్రస్తుతం సామాజిక పింఛను రూ.3వేలు అందిస్తున్నారు. దీనికి అదనంగా రూ.250 చొప్పున రెండు విడతల్లో రూ.500కు పెంచుతున్నట్లు కొత్త హామీల్లో పేర్కొన్నారు. అంటే 2029 ఎన్నికలు దగ్గర పెంచేందుకు నిర్ణయించారా అని పేదలు ప్రశ్నిస్తున్నారు. టీడీపీ అధికారంలో వస్తే పింఛను మొత్తాన్ని రూ.4వేలు చేస్తామని చెప్పిన అంశాన్ని ప్రస్తావిస్తున్నారు.
- పాత పథకాలనే వచ్చే ఐదేళ్లలో కొనసాగిస్తామని పేర్కొన్నారు. చేయూత, కాపునేస్తం, ఈబీసీ నేస్తంలో మార్పు లేదు. టైలర్లకు ఏడాదికి పది వేలు పాత పథకమే.
- ఫిష్ ఆంధ్రా బేషుగ్గా అమలు చేసినట్లు పేర్కొన్నారు. కాని జిల్లాలోని ఫిష్ ఆంధ్రా యూనిట్లన్నీ మూలకు చేరాయి.
- వైఎస్‌ఆర్ టెస్టు ల్యాబ్‌లు అందుబాటులోకి తీసుకు వచ్చినట్లు పేర్కొన్నారు. విజయనగరం జిల్లాకు సంబంధించి నెలివాడ వద్ద నిర్మించారు. ప్రారంభానికీ నోచుకోకుండా రెండేళ్లుగా విడిచి పెట్టారు. మిషనరీయే రాలేదు.
- గ్రూప్-1, గ్రూప్-2తో పాటు ఉద్యోగ నియామక పరీక్షలు క్రమం తప్పకుండా నిర్వహిస్తామని పేర్కొన్నారు. గతంలో కూడా ఇదే మాదిరిగా జాబ్ క్యాలండర్ అంటూ ఆశలు రేపి ఎన్నికల ఏడాదిలో మాత్రమే కొద్దిపాటి ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చారు.
- వైఎస్‌ఆర్ జలకళ పథకానికి వేలాది మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. బోర్లు వేసినవి, విద్యుత్ కనెక్షన్లు ఇచ్చినవి చాలా తక్కువ. రిగ్ బోర్ యజమానులకు బిల్లులు చెల్లించని కారణంగా వారు మధ్యలో వెళ్లిపోయారు. మళ్లీ ఎన్నికల హామీల్లో ఈ పథకాన్ని వైసీపీ చేర్చింది.
- సాగునీటి ప్రాజెక్టులను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. వచ్చే ఐదేళ్లలో మాత్రం సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్నారు. తారకరామ తీర్థసాగర్, తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు పెండింగ్ పనులను చూస్తున్న ప్రజలు ఈ హామీని కూడా నమ్మడం లేదు.
- ఏటా రైతు భరోసా పేరుతో రూ.13500 అందిస్తున్నారు కాని ఇందులో కేంద్రం అందిస్తున్న పీఎమ్ కిసాన్ రూ.6వేలు కలిసి ఉంది. ఇది మినహాయిస్తే జగన్ అందిస్తున్నది కేవలం రూ.7500. అందుకే తాజాగా రైతు భరోసాను రూ.16వేలకు పెంచుతున్నట్లు పేర్కొన్నా ప్రజలు సందేహం వ్యక్తం చేస్తున్నారు.
- రైతులకు 9గంటల పాటు విద్యుత్‌ను అందిస్తున్నట్లు పేర్కొన్నారు కాని ఏడు గంటలు మాత్రమే అందిస్తూ తొమ్మిది గంటలుగా ప్రచారం చేస్తున్నారు. ప్రతి రోజు రైతుల పంపుసెట్లకు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు అందిస్తున్నారు. అంటే ఆరు గంటలు మాత్రమే అందిస్తున్నారు. ఈ హామీని మళ్లీ చేర్చారు.
- జర్నలిస్టులకు 60శాతం రాయితీతో ఇళ్ల స్థలాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. గడిచిన ఐదేళ్లలో అందివ్వలేదు.
- హిందూ దేవాలయాలను అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో మాత్రం వైసీపీ ప్రభుత్వ హయాంలో విధ్వంసమే జరిగింది. రామతీర్థంలోని రాముని విగ్రహాన్ని ధ్వంసం చేశారు.
- కుల వృత్తులకు టీడీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చింది. ఆదరణ పథకం ద్వారా కుల వృత్తిల వారికి పనిముట్లు అందించి జీవన ప్రమాణాలు పెంచింది. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత వీటిని ఎత్తివేశారు. తాజా ఎన్నికల హామీల్లో కుల వృత్తులకు ప్రాధాన్యమని చేర్చారు. కానీ ఎవరూ నమ్మడం లేదు.



నిలిచిపోయిన తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు నిర్మాణం

ఇసుక లేకుంటే.. ఇల్లు కట్టేదెలా?



ఎస్.కోట: గోస్తనీ నది నుంచి నాటుబండ్లపై ఇసుక తరలిస్తున్న దృశ్యం

- సామాన్యుడికి అందనంత దూరం
- అసలు దొరకడమే గగనం
- మూడింతలు పెరిగిన ధర
- ట్రాక్టర్ల స్థానంలో విస్తృతంగా నాటుబండ్లు
- నిర్మాణ రంగంపై తీవ్ర ప్రభావం
- వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం



- చాలా కాలంగా అద్దె ఇంట్లో ఉంటున్నాను. ఈ ప్రభుత్వం ఇంటి స్థలం ఇవ్వలేదు. పైసా పైసా కూడ బెట్టి స్థలం కొని ఇంటి నిర్మాణం ప్రారంభించాను. అయి తే ఇసుక కోసం నానా తంటాలు పడాల్సి వస్తోంది. జగనన్న కాలనీల్లో నిర్మాణాలు చేపట్టేవారికే ఇసుక అంటున్నారు. సొంతంగా ఇల్లు కట్టుకొనేవారికి ఇవ్వడం లేదు. నాటుబండి లోడు ఇసుక రూ.1000 అడుగుతున్నారు. ఐదేళ్ల కిందట ఈ ధరకు ట్రాక్టర్ ఇసుక వచ్చేది.

-ఎస్.కోటకు చెందిన ఓ ఇంటి నిర్మాణదారుడి ఆవేదన.

- ప్రభుత్వం ఇసుక ట్రాక్టర్లపై కేసులు నమోదు చేస్తుండడంతో నాటు (ఎద్దులు) బండ్లు సమకూర్చుకున్నాం. వీటిని పట్టుకుంటే ఇసుక మాత్రమే పోతుంది. ట్రాక్టరైతే పోలీస్ స్టేషన్‌లో పెట్టుకుంటున్నారు. పనిలేకపోయినా డ్రైవర్‌కు జీతం ఇవ్వాలి. తిరగక పోతే ట్రాక్టరు పాడవుతుంది. ఎద్దులు ఎక్కడున్నా ఒకటే తిండి. బండి తొందరగా పాడవదు. ఇసుకను తోలుకొని జీవనం సాగించే మాకు ఇంతకంటే మరోపని తెలియదు. అప్పుడప్పుడు అధికారులు పట్టుకుంటు న్నారు. పదోపరకో ఇచ్చి వాటిని విడిపించు కుంటున్నాం. అందుకే ఒక బండిపై రూ.వెయ్యి అడుగుతున్నాం.

-నాటుబండ్లతో ఇసుక రవాణా చేస్తున్న ఓ వ్యక్తి జవాబు



శృంగవరపుకోట, ఏప్రిల్ 27:

సీఎం జగన్ దెబ్బకు ఏర్పడిన ఇసుక కొరతతో నిర్మాణదారులు, రవాణాదారులు కూడా ఇబ్బంది పడుతున్నారు. ఇసుక రవాణాదారులు ట్రాక్టర్లను వదిలేసి నాటుబండ్ల వెంట పడ్డారు. ఎద్దులకు పెట్టే దాణా ఖర్చులు పెరిగాయని... రెవెన్యూ, పోలీస్‌లను తప్పించుకొని తీసుకురా వడం ఎంతో కష్టమని వాపోతున్నారు. అధిక ధరకు ఇసుకను కొనుగోలు చేయలేకపోతున్నామని ఇళ్ల నిర్మాణ దారులు ఆవేదన చెందుతున్నారు. ఇలా రెండు వర్గాలను జగన్ ప్రభుత్వం దెబ్బతీసింది. జిల్లాలో గోస్తానీ, చంపావతి, వేగావతి వంటి నదులున్నాయి. వీటితో పాటు గెడ్డలు, వాగుల్లోనూ ఇసుక లభ్యమవుతోంది. దీన్నే కొంత మంది వ్యాపారంగా మలుచుకున్నారు. వీటి నుంచి ఇసుకను తవ్వి చుట్టుపక్కల గ్రామాల్లో నిర్మాణాలు చేపడుతున్న వారికి అమ్మేవారు. నదీ పరివాహక ప్రాంతాలు, గెడ్డలు, వాగులకు సమీపంలో ఉన్న గ్రామాలకు ట్రాక్టరు ఇసుక రూ.500లోపే దొరికేది. కాస్త దూరం వున్న గ్రామాలకు రూ.1000 నుంచి రూ.1500 వరకు లభ్యమయ్యేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. సామాన్యుడికి ఇసుక ధర పెనుభారంగా పరిణమించింది.

- ఇసుక తవ్వకాలతో నదీ పరివాహక ప్రాంతాలకు నష్టం కలగకుండా తెలుగుదేశం ప్రభుత్వం నిఘా పెట్టేది. వంతెనలు, తాగునీరు అందించే ఊటబావుల దగ్గర తవ్వకాలు జరగకుండా అడ్డుకోనేది. పర్యావరణం దెబ్బతినకుండా చూడడంతో పాటు స్థానిక అవసరాలకు ఇసుక పొందేలా వ్యవహరించేది. వైసీపీ అధికారం చేపట్టాక అంతా తారు మారైంది. నూతన ఇసుక పాలసీని తీసుకొచ్చింది. నదీ పరివాహక ప్రాంతాల్లో ఇసుకను తవ్వేందుకు టెండర్‌లను పిలిచింది. వేలంపాట వేసి కాంట్రాక్టర్లకు అప్పగించింది. ఎక్కడా ఇసుకను తవ్వకుండా అడ్డుకట్ట వేసింది. విడిగా ఇసుక ట్రాక్టర్ కనిపిస్తే చాలు కేసులు నమోదు చేశారు. అయితే జిల్లాలో వున్న నదులు, గెడ్డలు, వాగుల్లో కాంట్రాక్టర్ ద్వారా తవ్వేటంతటి ఇసుక నిల్వలు లేవు. మొదట్లో ఇసుకను విక్రయించిన అధికారులు ఇసుక నిల్వలు బాగా తగ్గిపోవడంతో పర్యావరణ ఇబ్బందులు తలెత్తుతాయని జిల్లా అధికార యంత్రాంగం హెచ్చరించడంతో ఆపేశారు. అప్పటి నుంచి స్థానిక అవసరాలకు ఇసుక దొరకడం లేదు.
- టన్ను, రెండు టన్నుల ఇసుక కావాలన్నా డిపోలకు వెళ్లి కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఇక్కడ కూడా జగనన్న కాలనీలకు మాత్రమే అందిస్తున్నారు. సొంతంగా ఇళ్లు నిర్మించుకోనే వారికి ఇసుక దొరకడమే గగనమవుతోంది. ఇలాంటి వారందరికీ నాటుబండ్లతో వచ్చే ఇసుకే ఆధారం. ట్రాక్టర్లను అధికారులు అడ్డుకోవడంతో ఇసుక వ్యాపారం చేసేవారంతా నాటు (ఎద్దుల) బండ్లను కొనుక్కొన్నారు. ఒక్కొక్కరు ఒకటి నుంచి మూడు, నాలుగు నాటు బండ్లు లాగేందుకు అవసరమైన ఎద్దులను పోషిస్తున్నారు. వీటి ద్వారా ఇసుకను రవాణా చేస్తున్నారు. ఇప్పుడు జిల్లాలో చిన్నచిన్న నిర్మాణాలు చేపట్టేవారికి వీరే ఆపద్బాంధవులు. అయిపే వీరు ఎక్కడ ఇసుక ఉంటే అక్కడ తవ్వేస్తున్నారు. ఊటబావులు, వంతెనల సమీప ప్రాంతాలనూ వదలడం లేదు. ఇవేమీ పట్టించుకోని యంత్రాంగం కంటబడితే కేసులు నమోదు చేయకుండా బేరాలకు దిగుతున్నారు. ఇసుక రవాణా చేస్తున్నవారు ఇదే విషయం చెబుతూ నిర్మాణదారుడికి మరింత ఎక్కువ ధరకు ఇసుకను అమ్ముతున్నారు.

ప్రశాంతంగా పాలిసెట్

- **7794 మంది విద్యార్థుల హాజరు**

కలెక్టరేట్, ఏప్రిల్ 27: పాలిసెట్ పరీక్ష శనివారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 24 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 8908 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 7794 మంది మాత్రమే రాశారు. 87.49 శాతం మంది హాజరయ్యారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పరీక్ష జరిగింది. విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు చాలా ఇబ్బంది పడాల్సి వచ్చింది. పరీక్షకు హాజరైన వారిలో 4605 బాలురు, 3189 మంది బాలికలు ఉన్నారు. విజయనగరం పట్టణంలోని పరీక్ష కేంద్రంలో 4520 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 4101 మంది రాశారు. బొబ్బిలిలో 2348 మంది రాయాల్సి ఉండగా 2002 మంది హాజరయ్యారు. గజపతినగరంలో 2040 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 1691 మంది పరీక్ష రాశారు. విజయనగరంలోని వివిధ పరీక్ష కేంద్రాలను సమన్వయకర్త ఆశారమణి పరిశీలించారు.

ఎన్నికల సిబ్బంది కేటాయింపు

- **12,522 మంది నియామకం**

కలెక్టరేట్, ఏప్రిల్ 27: వచ్చే నెలలో జరగనున్న ఎన్నికల నిర్వహణలో భాగంగా ఆయా అసెంబ్లీ నియోజకవర్గాలకు అవసరమైన పీవో, ఏపీవో, ఓపీవోల కేటాయింపు ప్రక్రియ శనివారం పూర్తయింది. స్థానిక ఎన్‌ఐసీ కార్యాలయంలో ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వారా జిల్లాలోని 12,522 మంది ఎన్నికల సిబ్బందిని నియోజవర్గాలకు కేటాయించారు. మహిళా ఉద్యోగులకు వారు పనిచేస్తున్న అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోనే వేరొక మండలంలో నియమిస్తున్నామని, పురుష సిబ్బందికి ఇతర నియోజకవర్గాల్లో నియ మిస్తున్నట్లు కలెక్టర్, సాధారణ పరిశీలకులు తెలిపారు. మూడో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ మే 11న జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జేసీ కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ త్రివినాగ్, డీఆర్‌వో అనిత తదితరులు పాల్గొన్నారు.



ఆన్‌లైన్‌లో సిబ్బంది కేటాయింపును పరిశీలిస్తున్న కలెక్టర్, ఎన్నికల పరిశీలకులు

పీపుల్స్ మేనిఫెస్టో

మార్కెటింగ్ సౌకర్యాలు మెరుగుపర్చాలి



సాలూరు రూరల్: రైతుల పంటలకు గిట్టుబాటు ధర లభించేలా మార్కెటింగ్ సౌకర్యాలు అందుబాటులో ఉండాలి. ప్రస్తుత మార్కెటింగ్ విధానాన్ని మెరుగుపర్చాలి. రైతుల పంటలకు మార్కెటింగ్ సౌకర్యాలు పూర్తిస్థాయిలో అందుబాటులో లేని పరిస్థితులు ఉన్నాయి. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఉన్నా సరిపోవడం లేదు. ప్రైవేట్ వ్యాపారులు చెప్పిన ధరలకు పంటను విక్రయించే పరిస్థితులు ఉన్నాయి. మార్కెటింగ్ సౌకర్యాలు మరింత విస్తృతం చేయాలి.

- సువ్వాడ రామకృష్ణ, రైతు, మామిడిపల్లి

అలా.. ఖర్చు తగ్గింది!



పార్వతీపురం,

[illegible]

దీంతో వారంతా ఇక్కడే నామినేషన్లు సమర్పించారు.

పార్వతీపురం కలెక్టర్ కార్యాలయం

అప్పట్లో రాజకీయాలు వేరు

పెద్దల మాట



మక్కువ: అప్పట్లో రాజకీయాలు స్నేహపూర్వక వాతావరణంలో ఉండేవి. మా గ్రామాల అభివృద్ధికి ఎవరు కృషి చేస్తారో ముందుగా చర్చించుకొని నిర్ణయం తీసుకొనేవారం. అభ్యర్థులు ఎవరైనా అందరితో కలిసి ఉండేవారు. కక్ష సాధింపు చర్యలు పెద్దగా ఉండేవి కావు. ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థి... ఓడిపోయిన అభ్యర్థి సహకారం తీసుకొని ముందుకు వెళ్లేవారు. ఎన్నికలు వస్తే గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొనేది. డబ్బులు తీసుకొనేవారం కాదు. పోటీ చేసే అభ్యర్థుల నీతి, నిజాయితీలే ఎన్నికల్లో గెలుపునకు కొలమానంగా ఉండేవి.

- పోలయ్య (83), డోకిశీల గ్రామం

హామీలు గుప్పించి.. నట్టేట ముంచి!



మూతపడిన భీమసింగి చక్కెర కర్మాగారం (ఫైల్)

ఎంతో మంది రైతులు.. కార్మికులకు ఉపాధినిచ్చిన భీమసింగి చెక్కర పరిశ్రమను వైసీపీ నాయకులు ఆధునికీకరణ పేరుతో మూసివేయించారు. దీంతో ఎంతో ఆశపడ్డ రైతులు ఉసూరుమంటున్నారు. మళ్లీ అధికారాన్నిస్తే దీన్ని లాభదాయకమైన పరిశ్రమగా మార్చేస్తామంటూ జిల్లాకు చెందిన వైసీపీ నాయకులు చెప్పడంపై రైతులు మండిపడుతున్నారు. దశాబ్దాల చరిత్ర కలిగిన ఈ పరిశ్రమ మూతపడడంతో వేలాది మంది ఉపాధిని కోల్పోయారు.

- మూతపడిన భీమసింగి చక్కెర పరిశ్రమ
- వైసీపీ నాయకుల మాటలకు మోసపోయిన రైతులు
- రోడ్డున పడిన కార్మికులు, ఉద్యోగులు
- ఆదాయం కోల్పోయిన అన్నదాత

(జామి)

ఉత్తరాంధ్రకే తలమానికంగా నిలిచిన విజయరామ గజపతి కోఆపరేటివ్ సుగర్స్ లిమిటెడ్ (భీమసింగి సుగర్స్) నేడు ఆనవాలు లేకుండా పోయింది. మండలంలోని కుమరాం గ్రామంలో కొన్ని దశాబ్దల కిందట గజపతిరాజుల వంశానికి చెందిన పీఎల్ఎన్ రాజు ఈ చెక్కర పరిశ్రమను స్థాపించారు. తరువాత కాలంలో స్వాతంత్ర్య సమరయోధుడు గొర్రిపాటి బుచ్చి అప్పారావు, లగుడు సింహాద్రి వంటి పెద్దలు దీనిని ఈ ప్రాంత రైతుల సాయంతో సహకార రంగంలోకి మార్పు చేయించారు.

లక్ష టన్నుల క్రషింగ్..

1967లో స్థాపితమైన ఈ ఫ్యాక్టరీ 1977 నుంచి క్రషింగ్ మొదలుపెట్టింది. ప్రారంభంలో విశాఖ, విజయనగరం జిల్లాలో 18 మండలాలకు చెందిన 3,500 మంది రైతులు ఈ కర్మాగారంలో 16,682 షేర్‌హోల్డర్స్ ఉన్నారు. 1250 టన్నుల కెపాసిటీతో క్రషింగ్ ప్రారంభమైంది. ఒకానొక దశలో లక్ష టన్నుల క్రషింగ్ జరిగిందటే ఈ ప్రాంత రైతులకు ఈ పరిశ్రమ ఎంత ఆదారమో చెప్పవచ్చు. ఎంతో మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఈ పరిశ్రమ ఉపాధి కల్పించింది. ఈ రెండు జిల్లాలకు చెందిన 543 గ్రామాల నుంచి చెరకు కర్మాగారానికి వచ్చేది. ఇక్కడ తయారైన పంచదారకు ఎంతో గిరాకీ ఉండేది. కాలక్రమంలో ఈ కర్మాగారం పరిస్థితి దయనీయంగా మారింది. ప్రస్తుతం విజయనగరం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి చెరకు వస్తుంటే 60వేల నుంచి 80వేల టన్నులు క్రషింగ్ జరుగుతుంది.

అధికారంలోకి వచ్చి మూయించారు

2019లో ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఒక సీజన్ నడిచింది. సుమారు 60వేల టన్నుల క్రషింగ్ జరిగింది. క్రషింగ్ పూర్తయిన వెంటనే జిల్లా మంత్రి, ఇద్దరు ఎమ్మెల్యేలు, ఎంపీల ఆధ్వర్యంలో మహాజన సభ ఏర్పాటు చేసి.. రైతులు, కార్మికులు నెత్తిన ఒక్కసారి పెద్దపిడుగులాంటి వార్త పడేశారు. భీమసింగి సుగర్స్ కర్మాగారానికి మహర్దశ రాబోతుందని 2020-21 సంవత్సరాల్లో రెండు క్రషింగ్‌లు నిలిపివేసి ఆధునీకరిస్తున్నామని చెప్పారు. వామపక్ష నాయకులు, లోక్‌సత్తా నాయకులు దీనిని ఖండించారు. వచ్చే క్రషింగ్‌కు కొత్త యంత్రాలు బిగించి క్రషింగ్ చేయాలని... దీనిని ఆపొద్దని కోరారు. అయినా సరే మంత్రి మాత్రం మీకు ఫ్యాక్టరీ అభివృద్ధి ఇష్టం లేదా? మీరు అభివృద్ధిని అడ్డుకుంటారా? అంటూ మండిపడ్డారు. మాటలు చెప్పిన మంత్రి, ఎమ్మెల్యేలు, ఎంపీలు ఆ తరువాత చేతులు ఎత్తేశారు. ఈ ఫ్యాక్టరీ ఆధునీకరణ మాట అటుంచి.. దీనిని పూర్తిగా మూలకు తోసేశారు.


మాట తప్పను.. మడమ తిప్పనని..



ఈ ఫ్యాక్టరీని ఎన్ని ప్రభుత్వాలు వచ్చిన పెద్దగా పట్టించుకోకపోయినా రైతులు, కార్మికులు మాత్రం తమ శ్రమతో నడిపించేవారు. ప్రభుత్వాలు ఉమ్మితడిగా ఇచ్చే సొమ్మును పొదుపుగా వాడుతూ ఎప్పటికప్పుడు యంత్రాల నిర్వహణ భారాన్ని మోస్తూ...ముందుకు నడిపారు. 2019లో ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు చెరకు రైతులు, కార్మికులు ఆయనను కలిసి పరిశ్రమ దీనస్థితిని వివరించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఫ్యాక్టరీని ఆధునీకరించి, పూర్వవైభవం తెస్తామని మాట ఇచ్చారు. ఈ జగన్ మాట ఇస్తే మడమ తిప్పడు అంటూ.. పెద్దపెద్ద మాటలు చెప్పారు. ఆయన వెనుక ఉన్న గజపతినగరం, ఎస్.కోట ఎమ్మెల్యేలు బొత్స అప్పలనర్సయ్య, కడుబండి శ్రీనివాస్ తమదిరైతు ప్రభుత్వం.. మీ వెంటే మేము ఉంటాం అంటూ భరోసా ఇచ్చేశారు. జిల్లాకు చెందిన మంత్రి బొత్స సత్యనారాయణ వీరికి వంతపా డారు. ఇది గుడ్డిగా నమ్మిన రైతులు, కార్మికులు తమకు మంచి రోజులు వస్తాయని బలంగా నమ్మారు.

పట్టని కార్మికుల వేదన..

ఈ ప్రభుత్వ హయాంలో ఇక ఫ్యాక్టరీ తెరవదన్న అభిప్రాయానికి రైతులు, కార్మికులు వచ్చేశారు. నాలుగేళ్లపాటు వారికి ఎదురుచూపులు మిగిలాయి. రైతులు చెరకు పంట వేయడం మానేశారు. కార్మికుల్లో చాలామందికి 18 నెలలుగా జీతాలు రాక పస్తులతో ఇప్పటికీ ఇబ్బందులు పడుతున్నారు. ఇక రిటైరు అయిన వారికి ఇప్పటికీ పీఎఫ్, గ్రాట్యూటీ, ఇతర సెటిల్‌మెంట్స్ ఊసేలేదు. కొద్దిరోజుల క్రితం ఎన్నికల ప్రచారంలో మంత్రి బొత్సను ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు ఫ్యాక్టరీ భవితవ్యం గురించి ప్రశ్నిస్తే... ఇక ఫ్యాక్టరీ ఊసు మరచిపోవాలని.. మన పార్టీ వచ్చే ఎన్నికల్లో గెలిస్తే లాభదాయక పరిశ్రమగా మార్చనున్నట్లు తేల్చేశారు. దీంతో ఈ ప్రాంత రైతులు, కార్మికులు ఈ ప్రభుత్వం తమ ఉసురు పోసుకుందని, దీనికి తగిన మూల్యం తప్పదంటూ శాపనార్థాలు పెడుతున్నారు. ఎంతో ఘన చరిత్ర కలిగిన భీమసింగి చక్కెర కర్మాగారం చరిత్రను కాలగర్భంలో కలిపేశారని మండిపడుతున్నారు. ఈ ఫ్యాక్టరీ పరిధిలో ఉన్న విశాఖ, విజయనగరం ఎంపీలు, శృంగవరపుకోట, గజపతినగరం ఎమ్మెల్యేలు తమది నిరంతరం రైతు ప్రభుత్వం అని మాటలు చెబుతూ రైతులను మభ్యపెట్టడం తప్ప.. రైతులకు చేసిందేమీ లేదని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.



నష్టాలు లేకపోయినా.. మూసివేయడం దారుణం



నష్టాలు లేకుండా నడుస్తున్న భీమసింగ్ సహకార చక్కెర కర్మాగారాన్ని వైసీపీ అధికారంలోకి వచ్చాక మూసేయడం రాష్ట్ర చరిత్రలో తొలిసారి. రాష్ట్రంలో ఉన్న ఎన్నో సహకార కర్మాగారాలు నష్టాలతో మూతపడినా.. ఈ ఫ్యాక్టరీ మాత్రం రైతులు, కార్మికులు కలిసికట్టు నడిపించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆధునికీరణ పేరుతో మూసేయడం దారుణం. రెండేళ్లలో ఆధునీకరించి తెరిపిస్తామన్న మంత్రి బొత్స మాటలను రైతులు నమ్మి మోసపోయారు. పరిశ్రమ తెరిపించేందుకు అఖిలపక్షం ఆధ్వర్యంలో పోరాటం చేశాం.

- భీశెట్టి బాబ్జీ, భీమసింగి సుగర్స్ అఖిలపక్ష పోరాట నాయకుడు

రూ.5 కోట్లు ఇవ్వలేని చేతకాని ప్రభుత్వం



ఈ ఫ్యాక్టరీని వైసీపీ ప్రభుత్వం కావాలనే మూసివేయించింది. కేవలం రూ.5 కోట్లు ఉంటే ఈ ఫ్యాక్టరీకి పూర్వవైభవం వస్తుందని చెప్పిన వారికి ఈ నిధులు తెచ్చే దమ్ములేకపోయింది. గత టీడీపీ ప్రభుత్వం పరిశ్రమ అభివృద్ధికి నిధులు ఇచ్చింది. వాటిని వైసీపీ వచ్చాక వినియోగించకపోవడంతో వెనక్కి వెళ్లిపోయాయి. రైతులు, కార్మికుల ఉసురుపోసుకున్న మంత్రి, ఎమ్మెల్యేలకు తగిన గుణపాఠం చెప్పేందుకు రైతులంతా సిద్ధంగా ఉన్నారు. పరిశ్రమ పరిరక్షణ కోసం హైకోర్టులో కేసు వేసి పోరాటం చేస్తున్నాం.

- బండారు పెదబాబు, మాజీ జడ్పీటీసీ, జామి

నిను వీడని నీడను నేను..!

- అభ్యర్థుల ప్రచారంపై అధికారుల మూడో కన్ను

(శృంగవరపుకోట)

ఈ సార్వత్రిక ఎన్నికల సమయంలో ఓ నియోజకవర్గ అభివృద్ధిపై ఓ పత్రిక కథనం ప్రచురించింది. పెయిడ్ ఆర్టికల్‌గా ఎందుకు భావించకూడదో వివరణ ఇవ్వాలని ఓ పార్టీ అభ్యర్థికి అధికారులు నోటీసు అందించారు. రూ.2 లక్షలకు లెక్క కట్టారు. దీనికి సమాధానం ఇచ్చేందుకు ఆ అభ్యర్థి దిక్కులు చూస్తున్నారు.

.. అభ్యర్థులపై ఎన్నికల కమిషన్ నిఘా ఎలా ఉంటుందో చెప్పడానికి ఈ సంఘటన ఓ ఉదాహరణ. ఎన్నికలు వచ్చాయంటే ఊరూ వాడా ఒకటే ప్రచార జోరు. అభ్యర్థి వెంట కదిలే అనుచర గణం... కార్లు, ద్విచక్ర వాహనాలు, లౌడ్ స్పీకర్లు, టీవీలు, పత్రికల్లో .. ఒకటేంటి? ఎన్ని చిత్ర విచిత్రాలో ..ఇలా ప్రచారం చేసేందుకు పరిమితికి మించి ఖర్చు పెట్టేందుకు వెనుకాడరు. ఓటరును ప్రలోభ పెట్టేందుకు పెడుతున్న ఖర్చును లెక్క పెట్టేందుకు అధికారుల బృందం వీరిని అనుసరిస్తుంది. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం అభ్యర్థులు ప్రచారంలో వినియోగించే ప్రతి పైసాను లెక్కిస్తుంది. ఇలా మూడో కన్ను నిరంతరం నిఘా పెడుతుంది. అభ్యర్థుల ప్రతి కదలికను వీడియోల్లో బంధిస్తున్నారు. అభ్యర్థుల ప్రచారం ప్రారంభం నుంచి ముగిసే వరకు వీరి వెంటే ఉంటున్నారు. జిల్లాలో పార్లమెంటు, శాసన సభలకు జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం, వైసీపీల మధ్యనే ప్రధాన పోటీ. వీటితో పాటు ఇతర పార్టీలు, ఇండిపెండెంట్లు పోటీ చేస్తున్నారు. అభ్యర్థులంతా జోరుగా ప్రచారం చేస్తున్నారు. సభలు, సమావేశాలకు, జన సమీకరణలకు లౌడ్ స్పీకర్లకు వెచ్చించే ఖర్చును వ్యయ పరిశీలకులు లెక్కిస్తున్నారు. ఈ లెక్కలు అభ్యర్థి ఖర్చును దాటేస్తే ఆ ఎన్నిక చెల్లదంటూ ఎన్నికల సంఘానికి ప్రకటించే అధికారం ఉంది.



చీపురుపల్లి నుంచి 11 జాతీయ పార్టీలు

(చీపురుపల్లి)

మీకు తెలుసా

ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఏర్పాటైన చీపురుపల్లి నియోజకవర్గం.. వివిధ అసెంబ్లీ ఎన్నికల్లో 11 జాతీయ పార్టీలు పోటీలో నిలిచేందుకు వేదికైంది. జిల్లాలో మరెక్కడా లేని విధంగా చీపురుపల్లి అసెంబ్లీ నుంచి ఎక్కువ సంఖ్యలో జాతీయ పార్టీలు తమ అభ్యర్థులను పోటీకి నిలపడం విశేషం. ఈ 11 జాతీయ పార్టీల్లో కేవలం భారత జాతీయ కాంగ్రెస్ తప్ప మరే పార్టీ ఇక్కడ విజయం సాధించలేదు. 1972లో జరిగిన ఎన్నికల్లో భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థిగా రౌతు పైడపునాయుడును రంగంలోకి దించింది.

- 1978లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ (ఐ) పార్టీ చిగిలపల్లి శ్యామలరావును, భారత జాతీయ కాంగ్రెస్ కుచ్చర్లపాటి లక్ష్మీపతిరాజును, జనతా పార్టీ రౌతు పైడపునాయుడును పోటీలో నిలిపాయి.
- 1983లో జరిగిన ఎన్నికల్లో కూడా కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీ, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్)లు తమ వారిని ఎన్నికల్లో పోటీకి నిలిపాయి.
- 1985లో మాత్రం జాతీయ పార్టీ తరఫున ఇక్కడ ఎవరూ పోటీ చేయలేదు.
- 1989లో లోక్‌దళ్ నుంచి దుగ్గిరాల కృష్ణకుమార్‌బాబు, జాతీయ కాంగ్రెస్ తరఫున మీసాల నీలకంఠం నాయుడులు పోటీ చేశారు.
- 1994లో కూడా కాంగ్రెస్, బీజేపీ, బహుజన్ సమాజ్ పార్టీలు వరుసగా కెంబూరి రామ్మోహనరావు, కోకా మాలతీదేవి, గుణుపూరు నరసింగరావులను తమ అభ్యర్థులుగా పోటీలో నిలిపాయి.
- 1999లో కాంగ్రెస్ తరఫున నీలకంఠంనాయుడు, రిపబ్లికన్ పార్టీ ఇండియా నుంచి దండి అప్పారావులు పోటీకి దిగారు.
- 2004లో కాంగ్రెస్ తరఫున బొత్స సత్యనారాయణ, బహుజన్ సమాజ్ పార్టీ నుంచి కిల్లి రాజమోహనరావులు పోటీ చేశారు.
- 2009లో తిరిగి భారత జాతీయ కాంగ్రెస్ బొత్స సత్యనారాయణను, బీజేపీ సాకేటి మోహనరావు ను, బహుజన సమాజ్ పార్టీ బైరెడ్డి అప్పలనాయుడును, రాష్ట్రీయ జనతాదళ్ పార్టీ పెందుర్తి వెంకటరావును పోటీలో నిలబెట్టాయి.
- 2014లో కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియాలు తమ అభ్యర్థులను నిలిపాయి.

2019లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జమ్ము ఆదినారాయణను, బీజేపీ శంకర్‌లాల్ శర్మను, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అమరా శ్రీదేవిని ఎన్నికల్లో నిలిపాయి. ఇలా దాదాపు అర్ధ శతాబ్దం పాటు జాతీయ పార్టీలు చీపురుపల్లి నుంచి తమ అభ్యర్థులను పోటీకి దింపుతూ వస్తున్నాయి.



ఇన్నాళ్లకు ఓటొస్తోంది!



సీతంపేట: ఎన్నికల కమిషన్ నిర్ణయం ఓ మహిళకు ఓటు వేసే అవకాశం కల్పిస్తోంది. అదీ రెండు దశాబ్దాల తరువాత. దారపాడు పంచాయతీలోని రామానగరానికి చెందిన ఆరిక ప్రిరిషికల (38) దివ్యాంగురాలు. దీంతో ఎన్నికల సమయంలో ఓటు వేసేందుకు వెళ్లే అవకాశం ఉండేది కాదు. ఎవరూ పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లడానికి సహకరించే వారు కాదు. ఓటు వేయాలనే కోరిక బలంగా ఉన్నా... పరిస్థితులు సహకరించకపోవడంతో ఇన్నాళ్లూ దూరంగా ఉండిపోయేది. తాజాగా ఎన్నికల అధికారులు 80 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, వికలాంగులు ఇంటి వద్దనే ఓటు హక్కును వినియోగించుకొనేందుకు అవకాశం కల్పించారు. దీంతో ప్రిరిషికలకు ఓటు వేసేందుకు వీలు కలిగింది. దీనిపై ఆమె సంతోషం వ్యక్తం చేస్తోంది.

ఓటు హక్కు వచ్చిన ఆనందంలో ప్రిరిషికల

పల్లెల్లో అంతా గప్‌చుప్

(గరుగుబిల్లి)



ఎన్నికలు దగ్గర పడుతున్నాయి. మైకుల హోరును పక్కన పెడితే ఓటర్ల పరంగా గ్రామాల్లో నిశ్శబ్ద వాతావరణం కనిపిస్తోంది. ఒక పక్క పోటీలో ఉన్న అభ్యర్థులు ప్రచారంలో జోరు కనబరుస్తుంటే... పల్లె ఓటర్లు వారి పనుల్లోనే నిమగ్నమై ఉన్నారు. దీంతో గ్రామాల ప్రధాన కూడళ్లలో హడావుడి ఎక్కడా కనిపించడం లేదు. ఎన్నికల పిచ్చాపాటి మాటలు వినిపించడం లేదు. అసలు ఎన్నికల సమయమేనా అనే సందేహం కలుగుతోంది. దీంతో ఏ పార్టీకి ఎంత బలం ఉంటుందనే అంచనా అంతు చిక్కడం లేదు. అభ్యర్థి ప్రచారానికి వచ్చిన సమయంలో పార్టీ కార్యకర్తలే రోడ్డెక్కుతున్నారు. ఏ పార్టీకీ మాటల్లో కూడా మద్దతు తెలపడం లేదు. ఈ విధానం చూస్తుంటే గప్‌చుప్‌గా ఓటు వేసే పరిస్థితి కనిపిస్తోంది.

కూల్‌గా ప్రచారం

గరుగుబిల్లి: ఎన్నికల పోలింగ్ సమయానికి కౌంట్‌డౌన్ మొదలైంది. దీంతో బరిలో నిలిచిన అభ్యర్థులు పోటా పోటీగా ప్రచారం చేస్తున్నారు. వారం రోజుల నుంచి ఉష్ణోగ్రతలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి. భానుడి ప్రతాపానికి పార్టీ నాయకులు, కేడర్ అల్లాడిపోతున్నారు. ఈ నేపథ్యంలో అభ్యర్థులు ప్రచార సరళి మార్చారు. గతంలో మాదిరిగా ఉదయం 9 నుంచి కాకుండా 7 గంటల నుంచే ఇంటింటి ప్రచారం మొదలు పెట్టేస్తున్నారు. 11 గంటలకే ముగించి.. మళ్లీ సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు కొనసాగిస్తున్నారు. బహిరంగ సభలు కూడా సాయంత్రం సమయంలోనే పెట్టుకుంటున్నారు. ఇక ప్రచారంలో ఖాళీ సమయం దొరికిందంటే పార్టీ కార్యాలయాల్లో సమావేశాలు, భవిష్యత్ వ్యూహాలపై చర్చిస్తున్నారు. అదే సమయంలో కొందరు పార్టీల్లో స్తబ్దుగా ఉంటున్న వారిని కలిసి వారిని తమవైపు తిప్పుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు ఎండ వేడికి భయపడి ప్రచారాలు ఎప్పుడు ముగుస్తాయా అని కేడర్ రోజులు లెక్క పెట్టుకుంటున్నారు. మొదటి విడతలోనే ఎన్నికలు జరిగి ఉంటే ఈ తిప్పలు తప్పేవని నాయకులు భావిస్తున్నారు.

ఉద్యమాల గడ్డ.. కురుపాం





కురుపాం నియోజకవర్గ ముఖచిత్రం

కోరన్న, మంగన్న స్థూపం

కురుపాం నియోజకవర్గం మ్యాప్

- దేశంలో అక్షరానికి ఆలయం ఉన్నది ఈ నియోజకవర్గంలోనే
- రెండో తిరుపతిగా పేరుగాంచిన తోటపల్లి దేవస్థానం ఇక్కడే

(జియ్యమ్మవలస)

కురుపాం నియోజకవర్గం 2009లో పునర్విభజనలో భాగంగా ఏర్పడింది. అంతకుముందు నాగూరు నియోజకవర్గంగా ఉండేది. ఎక్కువ సంవత్సరాలు శత్రుచర్ల వంశస్థులే ఈ నియోజకవర్గానికి ఎమ్మెల్యేలుగా ఉన్నారు. 1972లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో చంద్ర చూడామణిదేవ్ వైరిచర్ల ఇండిపెండెంట్‌గా పోటీ చేసి తన సమీప ప్రత్యర్థి శత్రుచర్ల ప్రతాపరుద్రరాజుపై 717 ఓట్ల తేడాతో గెలుపొందారు. తొలిసారి 1978లో ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచిన శత్రుచర్ల విజయరామరాజు.. ఆ తరువాత 1983, 1985, 1999లలోనూ ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆయన తమ్ముడు శత్రుచర్ల చంద్రశేఖరరాజు 1989లో ఎమ్మెల్యేగా గెలిచారు. తరువాత ఆయన మేనల్లుడు వీటీ జనార్దన్ థాట్రాజ్ 2009లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014, 2019లలో ఎమ్మెల్యేగా గెలుపొందిన పాముల పుష్పశ్రీవాణి... చంద్రశేఖరరాజు కోడలే. కురుపాం నియోజకవర్గాన్ని 37 సంవత్సరాల పాటు ఏలిన ఘనత శత్రుచర్ల కుటుంబానిదే. నాగూరు నియోజకవర్గంలో ఇక్కడి ఓటర్లు నాలుగుసార్లు కాంగ్రెస్‌కు పట్టం కట్టారు. కురుపాం నియోజకవర్గం ఆవిర్భావం తరువాత రెండుసార్లు వైసీపీ, ఓసారి టీడీపీ అభ్యర్థులు గెలుపొందారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో శత్రుచర్ల విజయరామరాజు మంత్రిగా పనిచేయగా.. వైసీపీ ప్రభుత్వంలో పాముల పుష్పశ్రీవాణి మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు.

పోరాటాల గెడ్డ

కురుపాం నియోజకవర్గం పోరాటాలకు పురిటి గెడ్డ. 1967లో మొండెంఖల్ వద్ద సభలో శ్రీకాకుళం గిరిజన రైతాంగ సాయుధ పోరాటం ఇక్కడి నుంచే ప్రారంభమైంది. ఆ పోరాట యోధులు వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం మాస్టారు ఈ ప్రాంతం వారే. వారి విగ్రహాలు కురుపాం మండలం గుమ్మ గ్రామం వద్ద భారీ స్థూపంతో ఏర్పాటు చేశారు. ఏటా గిరిజనులు అత్యధిక సంఖ్యలో హాజరై వారి వర్ధంతి రోజున ఘనంగా నివాళులర్పిస్తారు. అటవీ హక్కులన్నీ గిరిజనులకే చెందాలని వీరు పోరాటాన్ని కొనసాగించారు. ఆ పోరాటంలో 380 మంది కమ్యూనిస్టు కార్యకర్తలు పోలీసుల తూటాలకు బలయ్యారు. అంతేకాకుండా పార్వతీపురం కుట్ర కేసులో 450 మంది కమ్యూనిస్టు కార్యకర్తలు ఏడేళ్ల పాటు కోర్టుల చుట్టూ తిరుగుతూ ఐదేళ్ల పాటు శిక్ష అనుభవించారు. విడుదలైన తరువాత కూడా వీరు కమ్యూనిస్టు కార్యకర్తలుగానే కొనసాగారంటే దానికి వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం పోరాట పటిమే కారణం.

నాగూరు నియోజకవర్గంలో...

సం.	విజేత	పార్టీ	సమీప ప్రత్యర్థి	పార్టీ	మెజార్టీ
1972	వైరిచర్ల చంద్రచూడామణిదేవ్	ఇండిపెండెంట్	వైరిచర్ల ప్రతాపరుద్రరాజు	కాంగ్రెస్	717
1978	శత్రుచర్ల విజయరామరాజు	జనతా	వైరిచర్ల చంద్రచూడామణిదేవ్	కాంగ్రెస్	1,533
1983	శత్రుచర్ల విజయరామరాజు	కాంగ్రెస్	పువ్వల సోమందొర	సోషలిస్టు	623
1985	శత్రుచర్ల విజయరామరాజు	కాంగ్రెస్	వెంపటాపు భారతి	టీడీపీ	3,914
1989	శత్రుచర్ల చంద్రశేఖరరాజు	కాంగ్రెస్	వైరిచర్ల ప్రదీప్‌కుమార్‌దేవ్	టీడీపీ	3,435
1994	నిమ్మక జయరాజు	టీడీపీ	శత్రుచర్ల చంద్రశేఖరరాజు	కాంగ్రెస్	32,271
1999	శత్రుచర్ల విజయరామరాజు	కాంగ్రెస్	నిమ్మక జయరాజు	టీడీపీ	6,917
2004	కోలక లక్ష్మణమూర్తి	సీపీఎం	నిమ్మక జయరాజు	టీడీపీ	8,701

కురుపాం నియోజకవర్గంగా మారిన తర్వాత..

సం.	విజేత	పార్టీ	సమీప ప్రత్యర్థి	పార్టీ	మెజార్టీ
2009	వీటీ జనార్దన్ థాట్రాజ్	టీడీపీ	ఎస్.జయరాజు	ప్రజారాజ్యం	15,053
2014	పాముల పుష్పశ్రీవాణి	వైసీపీ	వీటీ జనార్దన్ థాట్రాజ్	టీడీపీ	19,083
2019	పాముల పుష్పశ్రీవాణి	వైసీపీ	వీటీ నరసింహప్రియ థాట్రాజ్	టీడీపీ	26,602

నియోజకవర్గంలో ఇలా..

మండలాలు	: కొమరాడ, కురుపాం, గరుగుబిల్లి, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస
రిజర్వుడు	: ఎస్టీ
పోలింగ్ కేంద్రాలు	: 268
ఓటర్లు	: 1,92,636 (2024 జనవరి 22 వరకు)
పురుషులు	: 93,592
మహిళలు	: 99,005
ఇతరులు	: 39



తోటపల్లి బ్యారేజీ (ఫైల్)

చిన తిరుపతిగా తోటపల్లి

కురుపాం నియోజకవర్గంలో పర్యాటక ప్రదేశాలకు కొదువ లేదు. ఇందులో ప్రధానంగా చినతిరుపతిగా పేరొందిన తోటపల్లిలో శ్రీవేంకటేశ్వరస్వామి, కోదండరామ స్వామి ఆలయాలు అత్యంత పవిత్రమైనవి. నిత్యం పెద్ద సంఖ్యలో ఇక్కడికి భక్తులు తరలి వస్తుంటారు.


- గుమ్మలక్ష్మీపురం మండలం తాడికొండ వద్ద జలపాతాలు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. ఇక్కడికి ఎక్కువగా పర్యాటకులు వస్తూ ఉంటారు.
- తోటపల్లి బ్యారేజీలో బోటు షికారు పర్యాటకులకు ఓ మధురానుభూతి. పక్షుల కిలకిలలు, స్వచ్ఛమైన.. ఆహ్లాదకరమైన పరిసరాలు పర్యాటకులను కట్టి పడేస్తుంటాయి.



తోటపల్లి దేవస్థానం ముఖద్వారం

అక్షర బ్రహ్మ ఆలయం


దేశంలో మరెక్కడా అక్షరానికి ఆలయం లేదు. కానీ గుమ్మలక్ష్మీపురం మండలం కన్నయ్యగూడ వద్ద గిరిజనులు అక్షర బ్రహ్మ ఆలయం నిర్మించారు. ఆనాడు సవర భాషను నేర్చుకుని గిరిజనులకు చదువు చెప్పాలనుకునే మహనీయుడు గిడుగు రామ్మూర్తి. ఆయన స్ఫూర్తితో 1993లో గుమ్మలక్ష్మీపురం మండలం కన్నయ్యగూడలో పాఠశాలను నిర్మించారు. తెలుగు మాధ్యమాలలో ఉన్న పాఠ్య పుస్తకాలను సవర భాషలోకి తర్జుమా చేసి ఆయన స్ఫూర్తితో సవర భాష గిరిజనులు అమ్మ భాషను అక్షర బ్రహ్మగా భావించి ఆలయాన్ని నిర్మించుకుని అక్కడ నిత్యం కొలుస్తుండటం విశేషం.



చంద్రచూడామణిదేవ్



శత్రుచర్ల విజయరామరాజు



శత్రుచర్ల చంద్రశేఖరరాజు



నిమ్మక జయరాజు



పాముల పుష్పశ్రీవాణి



వీటీ జనార్దన్ థాట్రాజ్



కోలక లక్ష్మణమూర్తి

ఈవీఎంలతో పర్యావరణ పరిరక్షణ

- చెట్లను కాపాడిన వైనం..

రాజాం రూరల్ : ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్)లేంటి?...పర్యావరణాన్ని పరిరక్షించడమేంటి? చెట్లను కాపాడడమేంటి?... అనేదేగా మీ అనుమానం. మీరు చదివింది నిజమే. ఎన్నికలలో ఈవీఎంలను వినియోగించడం వల్ల పర్యావరణ పరిరక్షణ సాధ్యమైంది.. అదెలాగో చూడండి.

- 1999లో బ్యాలెట్ పత్రాల ముద్రణకు 7,700 టన్నుల కాగితం వాడారంట.. ఇది జరిగి పాతికేళ్లు గడచింది. పాతికేళ్లలో దేశంలో ఓటర్ల సంఖ్య కూడా భారీగా పెరిగింది. ఈ నేపథ్యంలో ఎన్నికలలో ఈవీఎంలను ప్రవేశపెట్టి ఉండకపోతే... బ్యాలెట్ పత్రాలను ఉపయోగిస్తే సుమారు 25వేల టన్నుల కాగితం అవసరమని నిపుణుల అంచనా...అంటే ఈ మేరకు కాగితం మిగిలినట్లే. ఈ కాగితం తయారీకి ఎన్ని వందల చెట్లు కొట్టేవారో...అంటే అవన్నీ బతికినట్లే కదా పర్యావరణాన్ని పరిరక్షించినట్లే కదా.

ఈవీఎంల ప్రవేశం ఇలా...

- 1982లో కేరళ రాష్ట్రంలోని పరూర్ శాసనసభ నియోజకవర్గంలో జరిగిన ఉప ఎన్నికలలో ఈవీఎంలను మొట్టమొదటిసారిగా ఉపయోగించారు.
- వీటిని భారత ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, ఎలక్ట్రానిక్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అనే రెండు ప్రభుత్వరంగ సంస్థలు తయారు చేశాయి.
- విద్యుత్ సరఫరా లేనిచోట కూడా ఇవి ఆల్కలైన్ బ్యాటరీతో పనిచేస్తాయి..
- ఒక్కో ఈవీఎం 3,840 ఓట్లను నిక్షిప్తం చేయగలదు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో 1400 ఓటర్లనే ఎన్నికల సంఘం అనుమతిస్తుంది.



పూల 'దండ'యాత్ర

- జోరందుకున్న వ్యాపారం



(గరుగుబిల్లి) ఎన్నికల పండుగ చిరు వ్యాపారులకు ఊతమిచ్చింది. నామినేషన్లు, ప్రచార ఘట్టంలో పూల వ్యాపారం జోరందుకుంది. ఇప్పటివరకు నామినేషన్లు దాఖలు చేయడానికి ర్యాలీగా వెళ్లిన నేతలకు పూల దండలు వేయడానికి అభిమానులు, కార్యకర్తలు ఎగబడ్డారు. ముందుగానే పూల దండలకు ఆర్డర్లు ఇచ్చి సిద్ధం చేసుకున్నారు. నామినేషన్ల ర్యాలీలు ముగియడంతో ప్రచారానికి వెళుతున్న అభ్యర్థులకు గ్రామాల్లో పూల దండలు వేసి అభిమానం చాటుకుంటున్నారు. ఇక జిల్లా స్థాయి నాయకులు వచ్చినా, పార్టీ అధినేతలు వచ్చినా కార్యకర్తలు పూల దండలు, గజమాలలు వేసి కేరింతలు కొడుతున్నారు. నామినేషన్ల ఘట్టం ముగియడంతో అభ్యర్థులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందిస్తున్నారు. నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో సైతం పూలకు ఒక్కసారిగా డిమాండ్ వచ్చింది. పువ్వులు సిద్ధం చేసి అమ్మడానికి ఎదురు చూసే పరిస్థితి లేకుండా వ్యాపారులకు ముందుగానే ఆర్డర్లు ఇచ్చి మరీ దండలు, పువ్వులు తెప్పించుకుంటున్నారు. ఎన్నికలు ముగిసే వరకు పూల వ్యాపారం జోరుగా సాగుతుందని వ్యాపారులు సంబర పడుతున్నారు. అమ్మకాలు పెరగడంతో స్వల్ప లాభానికే విక్రయిస్తున్నామని పలువురు చెబుతున్నారు. ఎన్నికలు ముగిసిన తరువాత విజయం సాధించిన వారి విజయోత్సవ ర్యాలీ వరకు తమకు వ్యాపారం బాగానే సాగుతుందని పూల వ్యాపారులు ఉత్సాహంగా ఉన్నారు.

హలో.. అక్కడ ఎవరు గెలుస్తారు?



గరుగుబిల్లి: 'హలో... మన దగ్గర ఎన్నికలు ఎలా జరుగుతున్నాయి? ఈసారి ఎవరు గెలుస్తారు? జిల్లాలో ఎన్ని సీట్లు వస్తాయ'ంటూ దేశ, విదేశాలు, పక్క జిల్లాల్లో ఉన్న బంధువులు, స్నేహితులు ఫోన్ల ద్వారా సమాచారాన్ని తెలుసుకుంటున్నారు. రోజులో ఏదో ఒక సమయంలో బంధువర్గాలకు ఫోన్ చేసి సమాచారం అడుగుతున్నారు. ఎక్కువగా తెలంగాణ నుంచి ఇలా ఫోన్లు వస్తున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉద్యోగాలు చేస్తూ అక్కడ స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న వారు జిల్లా రాజకీయాలపై ఆసక్తి చూపుతున్నారు. వీరితో పాటు ఉద్యోగం, చదువుల నిమిత్తం అమెరికాకు వెళ్లిన వారు కూడా గెలుపు, ఓటములపై ఆరా తీస్తున్నారు. ఇటు జిల్లా వాసులు కూడా పక్క జిల్లాలు, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో ఉన్న బంధువులు, స్నేహితులకు ఫోన్ చేసి అక్కడి రాజకీయ పరిస్థితులను అడిగి తెలుసుకుంటున్నారు. ఎన్నికలు మొదలైన దగ్గర నుంచి ఫోన్లలో రాజకీయాలపై ఆసక్తికరంగా చర్చించుకోవడం గమనార్హం.

భలే గిరాకీ

- ప్రచార సామగ్రికి డిమాండ్ • తయారీదారులకు ఉపాధి

విజయనగరం (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు సమీపిస్తున్నకొద్దీ అభ్యర్థులు ప్రచారం ముమ్మరం చేస్తున్నారు. ఎన్నికల్లో గెలవాలంటే.. ముందుగా ప్రచారం హోరెత్తాలి. అలా జరగాలంటే అందుకు అవసరమైన వస్తు, వాహనాలను సమకూర్చుకోవాలి. ప్రత్యర్థిపై పైచేయి సాధించాలంటే అంతకుమించి ప్రచార ఆర్భాటం అవసరం. ప్రచారానికి అవసరమైన సామగ్రిని సంబంధిత వ్యక్తులు... సంస్థల నుంచి కొనుగోలు చేయడం.. అద్దెకు తీసుకోవడం పరిపాటి. వివిధ రకాల వస్తువులు... వాహనాలు... మైకొసెట్లు... డోర్ స్టిక్కర్లు, వాహనాల స్టిక్కర్లు, జెండాలు, బెలూన్, క్రాకర్స్ కండువాలకు ప్రస్తుతం విపరీతమైన డిమాండ్. తయారీదారులకు... అద్దెకు ఇచ్చేవారికి ఈ ఎన్నికల్లో చేతినిండా పని దొరుకుతోంది. దీంతో ఎంతో కొంత చేతికి అందుతోంది. ఈసారి పోలింగ్‌కు కాస్త సమయం ఎక్కువగా ఉండడం వీరికి కలసి వస్తోంది.



బెలూన్లతో కార్యకర్తల సందడి

ఎంపీగా ఒక్కసారే అవకాశం

విజయనగరం ప్రత్యేకత

విజయనగరం (ఆంధ్రజ్యోతి) నియోజకవర్గాల పునర్విభజన తరువాత నుంచి విజయనగరం ఎంపీగా ఒక్కసారే అభ్యర్థులకు అవకాశం ఇస్తున్నారు. ప్రతి లోక్‌సభ ఎన్నికల్లోనూ కొత్త ఎంపీని ఎన్నుకుంటున్నారు విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గ ఓటర్లు. గతంలో ఉన్న బొబ్బిలి పార్లమెంట్ స్థానం పునర్విభజనలో శ్రీకాకుళం- విజయనగరం జిల్లాలకు చెందిన అసెంబ్లీ సెగ్మెంట్లతో కలుపుకొని విజయనగరానికి మారింది. ఇందులో విజయనగరం, నెల్లిమర్ల, గజపతినగరం, ఎచ్చెర్ల, బొబ్బిలి, రాజాం, చీపురుపల్లి నియోజకవర్గాలు ఉన్నాయి. పార్లమెంటు స్థానం మారిన నాటి నుంచి ముగ్గురు అభ్యర్థులు పోటీ చేసి గెలిచారు. ఒకసారి గెలిచిన అభ్యర్థి మరోసారి పోటీలో ఉండటం లేదు. 2009లో మొదటిసారి జరిగిన ఎన్నికల్లో బొత్స ఝాన్సీ గెలుపొందారు. 2014లో అశోక్ గజపతిరాజు విజయం సాధించారు.. కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రిగా ఆయన బాధ్యతలు చేపట్టారు. 2019లో ఆయన ఓటమి చెందారు.. 2019 ఎన్నికల్లో బెల్లాన చంద్రశేఖర్ పోటీ చేసి విజయం సాధించారు. ప్రస్తుత ఎన్నికల్లో కూటమి తరపున కలిశెట్టి అప్పలనాయుడు, వైసీపీ నుంచి ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ బరిలో ఉన్నారు. మరి ఓటర్లు ఆనవాయితీని కొనసాగిస్తారో...కొత్త సంప్రదానికి తెరతీస్తారో చూడాలి.



గంటస్తంభం



అశోక్‌గజపతిరాజు



ఝాన్సీ



చంద్రశేఖర్

జగన్‌కు ఓటుతో బుద్ధి చెప్పండి

రాజాం: రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించి జగన్ సర్కారుకు ఓటుతో బుద్ధి చెప్పాలని జనసేన స్టార్ క్యాంపైనర్ పృథ్వీరాజ్ పిలుపునిచ్చారు. శనివారం ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా రాజాంలో జనసేన కార్యకర్తలు నాయకులతో కలిసిన అనంతరం స్థానిక ఓ హోటల్‌లో విలేకర్లతో మాట్లాడారు. ఉమ్మడి టీడీపీ అభ్యర్థిని గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేస్తేనే అన్ని సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు.

ఎన్నికల నిర్వహణపై శిక్షణ

బొబ్బిలి: బొబ్బిలి రెవెన్యూ కార్యాలయంలో శనివారం ఎన్నికల నిర్వహణకు సంబంధించి బీఎల్ఓలు, సూపర్ వైజర్లు, సెక్టార్ అధికారులకు రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో సాయిశ్రీ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈవీఎంలను వినియోగించే పద్ధతులను అన్నిస్థాయి అధికారులు తెలుసుకోవాలన్నారు. ఈ ప్రక్రియలో సమన్వయం చాలా అవసరమన్నారు.

మత్స్యకారుల సమస్యలు తీరేనా?

- చేకూరని విశ్రాంతి గది
- చేపలు నిలువ చేయలేక ఇక్కట్లు
- మడ్డువలస రిజార్వాయర్‌లో దొంగల పాలైన కేజ్

వంగర: మడ్డువలస రిజార్వయర్‌లో చేపలు వేటాడి జీవనం సాగిస్తున్న మత్స్యకారులను సమస్యలు వెంటాడుతున్నాయి. మత్స్యశాఖ మంత్రి సిదిరి అప్పలరాజు ఇచ్చిన హమీ గాలిలో కలిసిపోయిందని చెప్పాలి. గతంలో మడ్డువలస రిజర్వాయర్‌లో రాయితీపై వచ్చిన చేప పిల్లలు విడుదల చేయటానికి వచ్చిన మంత్రి ఇక్కడ మత్స్య సంపదకు అనువుగా ఉన్న ప్రదేశంగా గుర్తించామన్నారు. రిజర్వాయర్‌ను నమ్ముకుని జీవనం సాగిస్తున్న సీతారామ స్వదేశీ మత్స్యకార సొసైటీలో ఉన్న 574 మందిని అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. ఇక్కడ మత్స్యకారులకు విశ్రాంతి భవనం, చేపలు నిలువచేసుకుందుకు కావలసిన పరికరాలు అందజేసి మత్స్యకారులు తమకు చిక్కిన మత్స్యసంపద గిట్టుబాటు వచ్చేవరకు దాచుకునే వీలు కల్పిస్తామన్నారు. మంత్రి హమీతో మా తల రాతలు మారుతాయనుకున్న మత్స్యకారుల ఆశలు అడియాశలయ్యాయి. ఇచ్చిన హమీ నెరవేరక పోవడంతో సొసైటీ పూర్తిగా నిర్వీర్యమైపోయింది. ఇక్కడ సభ్యులు ప్రభుత్వానికి లీజు చెల్లించని కారణంగా వేట చేయరాదని మత్స్యశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అభివృద్ధి చేయలేదు సరికదా మత్స్యసంపద కూడా వేటానీయకుండా చేసి మా పొట్టలు కొట్టారని పలువురి విమర్శ.

● కేజ్ కొల్లగొట్టినా మౌనం ఎందుకో

రిజర్వాయర్‌లో మత్స్యకారులు అభివృద్ధికి కేంద్రప్రభుత్వం కేజ్ కల్చర్ ప్రవేశపెట్టింది. సూమారు రూ. 2 కోట్లు వెచ్చించి కేజ్ నిర్మించి అందులో తిలాపి చేపలు పెంపకానికి అన్ని రాయితీలు ఇచ్చింది కేంద్ర ప్రభుత్వం. కొన్ని రోజులు బాగా నడుపుకున్న మత్స్యకారులు వచ్చిన మత్స్య సంపద అమ్ముకోలేక, అధికారులే అమ్మకాలు సాగించాలని కోరారు. ఐతే మత్స్యసంపద ఎంతకు అమ్మకాలు జరిగాయి, మత్స్యకారులు వాటా ఎంత అన్న విషయం అధికారులు చెప్పకుండా మత్స్యసంపద అమ్మకాలు జరపగా వచ్చిన సొమ్ము ఉమ్మడి ఖాతాలో జమచేసినట్లు అధికారులు చెప్పడంతో సభ్యులు ఆగ్రహించారు. కేజ్‌ను పట్టించుకోకపోవడంతో దొంగలు రాత్రికి రాత్రే కేజ్‌ను కొల్లగొట్టారు. కేజ్ పోయిన విషయం గుర్తించిన అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసి సుమారు ఎనిమిది నెలలైనా ఎవరూ పట్టించుకోలేదు. ఒక ప్రముఖ నాయకుడి ఆదేశాలతో కేజ్ దొంగలను పోలీసులు గుర్తించలేదన్నది పలువురి వాదన. ఇంత విలువైన కేజ్ కొల్ల గొట్టిన వారిపై చర్యలు ఎందుకు తీసుకోలేదో నాయకులకు, అధికారులకే తెలియాలి. కేజ్ పోయిన విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎఫ్‌డీవో ప్రసాద్ తెలిపారు.



మడ్డువలస రిజర్వాయర్‌లో దొంగల పాలైన కేజ్ ఇదే

రాష్ట్ర భవిష్యత్తును నిర్దేశించే ఎన్నికలు: అశోక్



మాట్లాడుతున్న అశోక్ గజపతి, అదితి

విజయనగరం రూరల్: రానున్న ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తు, దిశా, దశ ని ర్దేశించే ఎన్నికలని, ఈ ఎన్నికల్లో ఓటర్లు ఆలోచించి ఓటేయాలని టీడీపీ సీని యర్ నేత అశోక్ గజపతిరాజు చెప్పారు. శనివారం పడాలపేట, నారాయణ పురం గ్రామాల్లో టీడీపీ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్ర చార సభల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ, ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం అధో గతి పాలైందన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులుగా కలిశెట్టి అప్పలనాయుడు, అదితి గజపతిరాజును గెలిపించాలని కోరా రు. విజయనగరం నియోజకవర్గ అభ్యర్థి అదితి గజపతిరాజు మాట్లాడుతూ ఐదేళ్ల కాలంలో అన్ని రంగాల్లో ఈ ప్రభు త్వం విఫలమైందన్నారు. టీడీపీ నాయకులు బొ ద్దల నర్సింగరావు, గంటా పోలినా యుడుతో పాటు పడాలపేట, నారాయణపురం గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. పడాలపేట, నారా యణపురం గ్రామాల్లో అదితి గజపతిరాజుకి స్థానిక టీడీపీ శ్రేణులు, ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ● వచ్చే నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులుగా ఎన్నికల బరిలో ఉన్న తనని, ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడుల విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని విజయ నగరం నియోజకవర్గ అభ్యర్థి అదితి గజపతిరాజు చెప్పారు. శని వారం పార్టీ కార్యా లయంలో నగరంలోని 41వ డివిజన్‌కు చెందిన పొట్నూరు ప్రసా ద్, సయ్యద్ హా ఫీజ్, మహమ్మద్, రెహ్మాన్, గొట్టిపాటి రాజుతో పాటు 50 కుటుంబా లు వారు వైసీ పీని వీడి, ఆదితి గజపతిరాజు సమక్షంలో టీడీపీలో చేరారు. టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు, అనురాధబేగం, కర్రోతు నర్సింగరావు, మస్తాన్ వలీ తదితరులు పాల్గొన్నారు.

పథకాల పేరుతో మోసం: లోకం మాధవి



మాట్లాడుతున్న పృథ్వీ, చిత్రంలో ఎమ్మెల్యే అభ్యర్థి లోకం నాగమాధవి

పూసపాటిరేగ: వైసీపీ ప్రభుత్వం పథకాల పేరుతో ప్రజలను మోసం చేస్తోంద ని సినీ నటుడు పృథ్వీరాజ్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆయన శని వారం ప్రచారం నిర్వహించారు. పతివాడ గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ తోడ పుట్టిన చెల్లికే న్యాయం చేయలేని వ్యక్తి రాష్ట్ర ఆడప డుచులకు ఏవిధంగా న్యాయం చేస్తాడన్నారు. ఈ సారి ఎన్నికల్లో కూటమిని గెలిపించి, రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేస్తున్న వారిని గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థి లోకం నాగమాధవి మాట్లాడుతూ జగన్ పరిపాలనలో జరుగుతున్న అరాచకాలపై తిరుబాటు చేయాల్సిందేనన్నారు. వస్తున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని గెలిపించి రాష్ట్రాన్ని అరాచకాలనుంచి కాపాడుకోవాలన్నారు. కూటమి గెలిస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని, లేదంటే రాష్ట్రం మరింత వెనుకబడిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి లోకం మాధవి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు, సీనియర్ నాయకులు మహంతి చిన్నంనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు మహంతి శంకరరావు, టీడీపీ నాయకులు, జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

ఒక్క అవకాశం అడిగి దోచేశారు: కలిశెట్టి



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎంపీ అభ్యర్థి కలిశెట్టి

బాడంగి/బొబ్బిలి ఏప్రిల్ 27: ఒక్క అవకాశం ఇవ్వండం టూ జనాల దగ్గర ప్రాధేయ పడుతూ అధికార పగ్గాలు అందుకున్న జగన్, ఆయన వైసీపీ నాయకు లంతా రాష్ట్ర సంపదనంత టీనీ బొక్కేశారని విజయనగ రం ఎన్‌డీఏ కూటమి ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్ప లనా యుడు ఆరోపించారు. ఎన్ని కల ప్రచారంలో భాగం గా ఆయన ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయు డుతో కలిసి బాడంగి మండలం డొంకినవలస, పింద్రింగివలస, తెంటువలస, పెద్దపల్లి తదితర గ్రామాల్లో శనివారం రాత్రి పర్య టించారు. ఈ సందర్భంగా ఆ యా గ్రామాల్లో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్రానికి మేలు చేయగల సత్తా ఒక్క చంద్రబాబుకే ఉందన్నారు. విధ్వంసం, అరా చకం, వేధింపులు, అవినీతి అక్రమాలు జగన్ మార్కు లక్షణాలని అన్నారు. రాష్ట్రాని కి రాజధాని లేకుండా చేసి న అసమర్ధ సీఎం అని అన్నారు. పోలవరం ప్రాజెక్టును 70 శాతం చంద్రబాబు పూర్తి చేశారని, జగన్ వచ్చాక దానిని గోదావరిలో కలిపే శాడని దుయ్యబట్టారు. వస్తున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని గెలిపించి రాష్ట్రాన్ని అరాచకాలనుంచి కాపాడుకోవాలన్నారు. కూటమి గెలిస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని, లేదంటే రాష్ట్రం మరింత వెనుకబడిపోతుందన్నారు. పోలవరం పూర్తయితే విజయనగరం జిల్లా ప్రాంతానికి కూడా ఎంతో మేలు జరుగుతుందన్నారు. బేబీనాయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల వారికి తీరని ద్రోహం చేసిన వైసీపీ ప్రభుత్వం ఇంటికి వెళ్లడం ఖాయమని అన్నారు. జగన్‌ను ఇంటికి పంపి చంద్రబాబు సీఎంగా గెలిపించుకుంటేనే రాష్ట్రానికి, యువతకు భవిష్యత్తు ఉంటుందన్నారు. తెంటు లక్ష్మునాయుడు, జనసేన నేత గిరడ అప్పలస్వామి, మండల టీడీపీ అధ్యక్షుడు తెంటు రవిబాబు, మండల నాయకులు, జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

అరాచక పాలన అంతం చేయడమే లక్ష్యం: కోండ్రు



చార్జీ సీటును చూపిస్తున్న ఉమ్మడి పార్టీల నాయకులు

రాజాం: అరాచకపాలన అంతం చేయ డమే కూటమి లక్ష్యం అని కోండ్రు మురళీ మోహన్ అన్నారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జనసేన, బీజేపీ నాయకులతో కలిసి ఎన్డీఏ చార్జీసీటును శనివారం విడుదల చేశారు. అనంత రం మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. రంజిత్‌కుమార్, కోటగిరి నారాయణరావు, ఉర్లాపు పోలి రాజు తదితరులు పాల్గొన్నారు. ● హత్యా రాజకీయాలు వైసీపీవే అని నియోజక వర్గ టీడీపీ అభ్యర్థి కోండ్రు అన్నారు. శనివారం శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ కనుమరుగయ్యే సమయం ఆసన్నమైందని కోండ్రు అన్నారు. శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో మండలం గడిముడిదాం గ్రామానికి చెందిన 20 వైసీపీ కుటుంబాలు, పురపాలక సంఘం పరిధిలోని సారధికి చెందిన 10 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వారికి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ● మండలం గడిముడిదాం, ఆగూరు, దోసరి రామినాయుడువలస, వీఆర్ అగ్రహారం గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారానికి వెళ్లి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీ మహిళలు మంగళ హారతులు ఇచ్చి ఘనస్వాగతం పలికారు.

● **రేగిడి:** రాష్ట్రాన్ని నాశనం చేసి, అరాచకపాలన సాగిస్తున్న జగన్ ప్రభుత్వాన్ని ఓటుతో గద్దెదించాలని కోండ్రు మురళీమొహనరావు ప్రజలకు పిలుపునిచ్చారు.

ఎన్నికల నిర్వహణ సజావుగా సాగాలి



పోస్టల్‌బ్యాలెట్ల వివరాలపై ఆరా తీస్తున్న ఎన్నికల పరిశీలకుడు

బొబ్బిలి: బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో జరు గుతున్న ఎన్నికల ఏర్పాట్లను ఎన్నికల పరిశీలకుడు తలాథ్ పర్వేజ్ ఇక్బాల్ రోహిల్లా శనివారం పరిశీలించారు. తొలుత ఆర్డీవో కార్యాలయా నికి విచ్చేసి రిటర్నింగ్ అధికారి ఎ.సాయిశ్రీతో చర్చించా రు. పోస్టల్‌బాలెట్లు దరఖాస్తు లు.. తదితర రికార్డులను పరి శీలించారు. ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. పట్టణ పరిధిలోని గొల్ల పల్లి శ్రీ వేణుగోపాల మున్సిపల్ హైస్కూలు లోఏర్పాటు చేసిన 74, 85 నెంబర్ల పో లింగ్ స్టేషన్లలో సౌకర్యాలను తనిఖీ చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో ఆర్వో, ఏఆర్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఏఆర్‌ఓలు లాలం రామలక్ష్మి, త్రినాథరావునాయుడు, డీఎస్పీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ● **రాజాం రూరల్:** ఎన్నికల నిర్వహణ సజావుగా జరగాలని ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు తలాథ్ పర్వేజ్ ఇక్బాల్ రోహిల్లా స్పష్టం చేశారు. రాజాం తహసీల్దార్ కార్యాలయాన్ని శనివారం ఆయన పరిశీలించారు. రిట్నంగ్ అధికారి కార్యాలయం, కంట్రోల్ రూం, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, ఈవీఎంలు భద్రపరిచే గదులను పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని నాలుగు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఆర్వోకు పలు సూచనలు చేశారు. ఓటర్లు ఎండబారిన పడకుండా షామియానాల ఏర్పాట్లుపై ప్రత్యేకశ్రద్ధ చూపాలన్నారు. తహసీల్దార్ కృష్ణంరాజు, రా జాం టౌన్, రూరల్ సి.ఐ.లు మోహనరావు, శ్రీనివాస్, ఎస్.ఐ. రవికిరణ్, ఎన్నికల డిప్యుటీ తహసీల్దార్ ప్రకాశ్ తదితరులున్నారు.

ప్రకృతి సాగుపై అవగాహన

గంట్యాడ: కొండతామరాపల్లి గ్రామంలో శనివారం స్థానిక ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎర్నిబాబు ప్రకృతి సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ తొలకరి వర్షాలకు ముందుగా ఎకరానికి 12 కిలోల చొప్పున నవధాన్యాల విత్త నాలు జల్లుకోవాలని సూచించారు. తద్వారా నేల సార వంతం అయి ఎల్లప్పుడూ తేమగా ఉండడమే కాకుండా కోతకు గురికాకుండా ఉంటుందని వివరించారు.

సీఎంగా చంద్రబాబు అవసరం

శృంగవరపుకోట/వేపాడ: రాష్ట్రానికి సీఎంగా చంద్రబాబు నాయుడు అవసరం ఉందని శాసన సభ టీడీపీ అభ్యర్థి కోళ్ల లలిత కుమారి అన్నారు. శనివారం శృంగవరపుకోట పట్టణంలోని ఎస్సీకాలనీ, గౌరీ శంకరకాలనీ, చాకలివీధి, ముస్లీంవీధి, చినవేమలి వీధి, గొల్ల వీధి, సాలి వీధుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అలాగే వేపాడ మండలం చామలాదేవి ఆగ్రహరం, కొలికిపాలెం ,దుంగాడ, పెదదుంగాడ కడకొండ గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

బినామీ మస్తర్లు వేస్తే చర్యలు

రామభద్రపురం: ఉపాధిహమీ పథకంలో వేతన దారులకు బినామీ మస్తర్లు వేస్తే కఠిన చర్యలు తీసు కుంటామని ఎంపీడీవో ఈశ్వరమ్మ హెచ్చరించారు. మండ ల పరిధిలోని పాతరేగ గ్రామంలో శనివారం ఉపాధి పను లు పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఏపీవో త్రినాథరా వు, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టీడీపీతోనే భవిష్యత్తు

రాజాం రూరల్: రాష్ట్ర భవిష్యత్తు తెలుగుదేశం పార్టీ తోనే సాధ్యపడుతుందని, రానున్న ఎన్నికలలో తెలుగు దేశం, జనసేన, భారతీయ జనతాపార్టీ కూటమి అభ్యర్థుల ను గెలిపించాలని తూర్పుకాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ కొల్ల అప్పలనాయుడు స్పష్టం చేశారు. సంతకవిటి మండ లం కాకరాపల్లి, మందరాడ, సురవరం, జావాం గ్రామా లలో తెదేపా శ్రేణులతో కలిసి శనివారం ఆయన ఇంటింట ప్రచారం నిర్వహించారు.

అధిక వడ్డీలు వేసి.. ఆస్తులు లాక్కొన్నారు

విజయనగరం (ఆంధ్రజ్యోతి): 'ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి వడ్డీ వ్యాపారం పేరిట ఎన్నో కుటుంబాలను రోడ్డున పడేశారు. అధిక వడ్డీలకు అప్పులు ఇచ్చి, హమీగా రాసుకున్న ఆస్తులను లాగేసుకుంటున్నార'ని అర్బన్‌బ్యాంక్ మాజీ చైర్మన్, మాజీ జిల్లా యూత్ కాంగ్రెస్ నేత కాళ్ల గౌరీశంకర్ ఆరోపించారు. శనివారం నగరంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో గౌరీశంకర్ మాట్లాడుతూ ఎంతో మందికి అప్పుగా డబ్బులు ఇచ్చి, తీర్చలేని విధంగా వడ్డీలు వేసి అమాయకుల వద్దనుంచి భూములు, ఆస్తులు కొట్టేసారని ఆరోపించారు. గాడు అప్పారావు, హంస శ్రీను, కనకల మూర్తి, కాళ్లశ్రీను (పంతులు శ్రీను) పట్రాయుకుల రవి తదితరులు పాల్గొన్నారు.

తెట్టంగిలో జూనియర్ కళాశాలలో ప్రవేశాలు ప్రారంభం

గుర్ల: తెట్టంగి జడ్పీ ఉన్నత పాఠశాల ఈ ఏడాది జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ కావ డంతో ప్రవేశాలు ప్రారంభమైనట్లు కళాశాల సిబ్బంది శ్రీనివాస్ తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి ఇంటర్ ఎంపీసీ, సీఈసీ గ్రూపులకు అడ్మిషన్లు జరుగుతున్నట్లు చెప్పారు.

18 ఏళ్లు నిండిన వారందరికీ బీసీజీ టీకా

కొత్తవలస: క్షయవ్యాధి నిర్మూలన కోసం మే నెల 16 నుంచి వయోజనులకు ఇవ్వనున్న బీసీజీ టీకాకు సంబంధించి శక్రవారం స్థానిక పీహెచ్‌సీలో వైద్యాధికారి సీతల్ వర్మ ఆశా కార్యకర్తలకు, వైద్య సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కేంద్రప్రభుత్వం 2025 నాటికి దేశంలో క్షయవ్యాధి అనేది లేకుండా చేయడం కోసమే ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారరు. వైద్య సిబ్బంది గ్రామాల్లో అవగాహన కార్యక్రమం చేపట్టాలన్నారు.

టీడీపీతోనే రాష్ట్ర అభివృద్ధి

బాడంగి: టీడీపీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన అన్నారు. శనివారం మండలంలోని ఎరుకులపాక, లక్ష్మీపురం, డొంకినవలస, పెద పల్లి, పింద్రంగివలస, తెంటువలస గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిన అయిదేళ్ల కాలంలో ఈ ప్రభుత్వ హయాం లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. ఎంపీ అభ్యర్థి కళిశెట్టి అప్పలనాయుడు, తనను సైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మంనాయుడు, రాష్ట్ర ఎస్టీ సెల్ జనరల్ సెక్రటరీ పాలవలస గౌరు ఉన్నారు. **బొబ్బిలి:** బొబ్బిలిలో బేబీనాయన ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం పట్టణంలోని మూడోవార్డు ప్రాంతంలో ఇంటింటి ప్రచారం నిర్వహించా రు. మహిళలు ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. పట్టణ టీడీపీ అధ్యక్షు డు రాంబార్కి శరత్‌బాబు, వార్డు కౌన్సిలరు దాసరి సురేష్, సీనియర్ నేతలు తది తరులు పాల్గొన్నారు. ● బొబ్బిలి ఎన్‌డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయ నకు రాష్ట్ర లోక్‌సత్తాపార్టీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ సంఘీభావం తెలిపారు. శనివా రం బొబ్బిలి కోటలో బేబీనాయనను కలు సుకొని తాజా రాజ కీయ స్థితిగతులపై చర్చించారు. జిల్లా పౌరవేదిక అధ్యక్ష, కార్యదర్శులు జలం త్రి రామచంద్ర రా జు, పిడకల ప్రభాకరరావు ఉన్నారు.

నియోజకవర్గ ఆర్వోకు పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు అందించాలి

శృంగవరపుకోట: తాను విధులు నిర్వహిస్తున్న చోట, నియోజవర్గ ఎన్నికల రి టర్నింగ్ అధికారి కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ కోసం ఉద్యోగి దరఖాస్తు చేసుకో వాలని శృంగవరపుకోట ఎన్నికల రిటర్నింగ్ అధికారి మురళీకృష్ణ అన్నారు. అక్కడ చేసిన దరఖాస్తులను జిల్లా ఎన్నికల అధికారి ద్వారా ఓటుహక్కు ఉన్న నియోజకవ ర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి పంపిస్తారన్నారు. ఇలా పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులు ఓటు హక్కున్న నియోజకవర్గ ఫెసిలిటే షన్ సెంటర్‌లో ఓటేయాల్సి ఉంటుందన్నారు. మే ఒకటి వరకు పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తులు స్వీకరించేందుకు ఎన్నికల సంఘం గడువు పెంచిందన్నారు. మే 5న పీవో, ఏపీవో, మైక్రోఅబ్జర్వర్స్, మే 6న ఓపీవోలు, మే 7న పోస్టల్ బ్యాలెట్‌ను విని యోగించుకునే ఇతర ఉద్యోగులు ఓటేసేందుకు ఎన్నికల సంఘం చర్యలు తీసుకుం దన్నారు. వీరంతా విభాగాల వారీగా ఏర్పాటు చేసిన ఈ మూడు రోజులు ఫెసిలిటే షన్ సెంటర్‌లోనే ఓటును వినియోగించుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ నారాయణమ్మ ఉన్నారు.


మీసాల గీతను కలిసిన నాగార్జున

విజయనగరం రూరల్: మాజీ ఎమ్మెల్యే మీసాల గీతను జిల్లా పార్టీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున శనివారం ఆమె నివాసంలో కలిశారు. విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గానికి స్వతంత్ర్య అభ్యర్థిగా ఎన్నికల బరిలో వున్న ఆమె ఇప్పటికే ప్రచారాన్ని ప్రారంభించారు.. అయితే జిల్లా పార్టీ అధ్యక్షుడు నాగార్జున వెళ్లి ఆమె నివాసంలో మాట్లాడారు.. పార్టీ కష్టకాలంలో వుందని, రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా మనమంతా కష్టించి పనిచేయాలని ఆమెకు సూచించారు. తనకు జరిగిన అన్యాయాన్ని నాగార్జున దృష్టికి గీత తీసుకువచ్చారు. మీసాల గీత భర్త మీసాల శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ సైలాడ త్రినాథ్, దాట్ల రవిరాజు తదితరులు ఉన్నారు.

తూతూ మంత్రంగా మండల సమావేశం

గుర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వెంకటరావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ పొట్నూరు ప్రమీల మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. ఎన్నికల కోడ్ ఉన్నందున ఎటువంటి ఎజెండా లేకుండానే సభ ముగించారు. ఈ సమావేశంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రాబోయేది కూటమి ప్రభుత్వమే: కళా



మాట్లాడుతున్న కళా

గరివిడి: రాష్ట్రంలో రాబోయేది కూటమి ప్రభుత్వమే అని చీపురుపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కిమిడి కళా వెంకట రావు అన్నారు. మెరకముడిదాం మండలంలోని నరసయ్య, గొట్టిపల్లి, గాదెల మర్రివలస పంచాయతీల్లో ఆయన శనివారం పర్య టించారు. ఉపాధి పనుల వద్దకు వెళ్లి కూలీలతో మాట్లాడారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. టీడీపీ మండల అధ్యక్షుడు తాడ్డి సన్యాసినాయుడు, మాజీ ఎంపీపీ కోట్ల మోతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి నేషనల్ తైక్వాండో సెమినార్

విజయనగరం దాసన్నపేట: నగరంలో మే నెల 3, 4, 5 తేదీల్లో రాజీవ్ ఇండోర్ స్టేడియంలో జరగనున్న నేష నల్ తైక్వాండో రిఫరీ, రీఫ్రెషర్ సెమినార్ బ్రోచర్‌ను జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అ య్యలు, సీహెచ్ వేణుగోపాలరావు ఆవిష్కరించారు. శనివా రం తైక్వాండో కార్యాలయంలో ఈ బ్రోచర్‌ను అవిష్కరించి తైక్వాండో క్రీడలో క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించాలని వారు కోరారు. స్టైకింగ్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంఎస్ఎన్ రాజు, ఛపక్‌తక్రా ప్ర ధాన కార్యదర్శి రాజేష్, మ హేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

గుర్ల: పెనుబర్తి గ్రామానికి చెందిన పలువురు శని వారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరంతా చీపు రుప ల్లిలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి కమిడి రామ్‌మల్లిక్‌నాయుడు సమక్షంలో పార్టీ తీర్థం పు చ్చుకున్నారు. టీడీపీలో చేరినవారిలో పెనుబర్తి గ్రామ యూత్ వైసీపీ లీడర్ గుషిడి మణికంఠనాయుడు తదితరులు ఉన్నారు.